


# అప్పగింత

ఇల్లూ అన్న తరువాత, పిల్లా పిచికా ఉన్న తరువాత పెరట్లో లక్ష్మిలా ఆవు ఉంటేనే కళా కాంతీనూ. డబ్బా పాలతో పెరిగే ఈకాలపు వాళ్ళకు ఆవు అంటే పేడా, దోమలూ ఇవే కనుపిస్తాయి. వీర్రాజుగారి ధోరణే అంత. కూతుర్ని అప్పగించినట్టే లక్ష్మిని కూడా అల్లుడికి అంటగట్టారు. ఆయన అయితే ఆ అనుబంధం త్రెంచుకున్నారే గాని కూతురుమాట ఏమైనా ఆలోచించారా ?

"ఇదిగో, అబ్బాయీ, సుబ్బారావూ, వేంజెప్పే మాటవినూ. ఇల్లూ అన్నతరువాత, పిల్లాపిచికా ఉన్న తరువాత, పెరట్లో లక్ష్మిలా ఆవు అంటూ ఉంటేనే ఆ యింటికి కళా, కాంతీని. నామాట కాదనకు. మాయింటి లక్ష్మిని నీ పెరట్లో కట్టేస్తాను. రేపు పున్నానికి యీనుతుంది. ఈ పసి వెధవని డబ్బాపాలతో పెంచుదామను కొంటున్నావుటోయి? నేనెంతమాత్రం ఒప్పుకోను? ఏమనుకొంటున్నావో ఏమో—చూడు మాతల్లి, పాప, మాముసిలి ఆవు గంగి గోవుపాలుతాగే పెరిగింది. అందుకే దాని మొహంలో ఆ తేజస్సూ, కళ్లలో ఆ దయా వచ్చాయి మాతల్లికి."

ఈ మాటలు చెప్తున్నంతసేపూ వీర్రాజుగారు మొహంలో నవరసాలు ఒలికించేస్తూనే ఉన్నారు. క్షణంలో ఆవేశం, మళ్లా దైన్యం, వెంటనే క్షోభ, కళ్లు పెద్దవిచేస్తూ, చిన్నవిచేస్తూ, బుగ్గలు పూరిస్తూ, నోరు లక్కపిడతలా కుంచిస్తూ,



గొంతు గద్గదికం చేస్తూ చెప్పే ఆయన మాటలు తీరే ఒక తరహా. ఆయన మాటలు వినేకన్న ఆయన హావభావాలు చూడడమే ఒక ముచ్చటగా ఉంటుంది. అంతేకాదు, నవ్వు వస్తుంది. మరో చిత్రం ఏమిటంటే, అనవసరమయినవాటికి ఆవేశంతోనూ నిజంగా గుండెకు పట్టేమాటలు తేలికగానూ చెప్తారు ఆయన.

సుబ్బారావుకు మామగారిధోరణి అలవాటే. అందులో ఆవుల విషయం వచ్చిందంటే వీర్రాజుగారి ఉత్సాహం రెచ్చిపోతుంది. ఈసారి ఆయన తన పట్టు వదిలేటట్టులేరు. అందుచేత ఆవుల పెంపకంలో తననుకొంటున్న సాధక బాధకాలు కూడా చెప్పుకోవాలికదా. నవ్వుతూ అన్నాడు:

"అదికాదు మామగారూ. నా మాటకూడా వినండి మీరు. ఆవుల్ని పెంచడమంటే మాలాటి సామాన్యులకు చేతనవుతుందా ? అది మీబోటి గోపూజాధురంధరులకే చెల్లింది. ఆవు అంటే మాకు పాలు మాత్రమే తడతాయి. ఆవు యింట్లో ఉంటే, కళాకాంతీకన్న పేడా, రొచ్చు ఉండే దోమలూ, యివే కనిపిస్తాయి. అదీకాక పీటితో ఒక బాధ. దానికి ఉండడానికి శాల వేయించాలి. తోలుకొనివెళ్లడానికీ, పాలు తీయడానికీ మనుషులను ఏర్పాటు చేసుకోవాలి. రోజూ పచ్చిగడ్డి ఏర్పాటు చేయించాలి. ఎందుకు చెప్పండి ఈ యాతన మాకు? ఒక రూపాయి పారేస్తే శేరుపాలు ఆవును యింటికి తీసుకొని వచ్చి పితికి యిస్తారు. అదీకాక మాయింట్లో మేమంతా డబ్బాపాలతో పెరిగినవాళ్లమే."

వీర్రాజుగారు ఈ శుష్కసత్యాల్ని భరించలేక పోయారు. "ఆ. పెరిగేరు డబ్బాపాలతో. గొప్ప పని చేసేరు. ఆవు అంటే పాలకు తప్పించి మరెందుకూ కాదన్నమాట. ఇల్లూ అంటే భోజనం చేయడానికీ, నిద్రపోవడానికీని. అంతే కదూ? అలా అయితే ఏపూటకూళ్ల యింట్లోనో భోజనంచేసి ఏ మఠంలోనో నిద్రచేయవచ్చునే. ఏమిటోయి మహా చెప్పవచ్చేవు. నువ్వు వెయ్యి చెప్పు, లక్షచెప్పు. మా లక్ష్మిని తోలుకొనివచ్చి పెరట్లో కట్టేస్తాను. నువ్వేం అన్నా సరే. ఇంతకూ నువ్వేం చెయ్యాలి? అన్ని ఏర్పాట్లూ నేను చేసే వెళతాను. దాని పెంపకం అంతా మా పాప చూసుకొంటుంది. మా లక్ష్మి. అది ఆవుటోయి సాక్షాత్తు మహాలక్ష్మికాని? ఉదయాన్నే దాని మొహంచూస్తే సమస్త పాపాలూ పోతాయి. ఆ జాతి కళ్ళూ, ఆ కొమ్ములతీరూ."

సుబ్బారావు యిక లాభంలేదనుకొన్నాడు. "మామగారూ మరెందుకు యిన్నిమాటలు. మీ అమ్మాయి బాధపడగలనంటే నాకేమీ అభ్యంతరంలేదు." నేను ఆఫీసుకు పోతాను. నేను వచ్చేదాకా ఉంటారా?"

వీర్రాజుగారు జయించిన సంతృప్తితో అన్నారు: "ఆ నువ్వు వచ్చేదాకా కూర్చొంటాను.

# అప్పగింత

నాకు మరేమీ పనిలేదూ ? మళ్లా వారంనాడే లక్ష్మిని తోలుకోనిరావడం."

సుబ్బారావు ఆఫీసుకు వెళ్లిన తరవాత రాధ తండ్రితో అంది: "నాన్నా, స్నానం చేయకూడదూ భోజనంచేదువుకాని. "అయినా నాన్నా, వీ కెందుకు ఆ పట్టుదల ఆయనకు యిష్టం లేదు. ఏదో డబ్బు పారేస్తే పాలు దొరక్క పోవుకదా?"

"ఆ వెర్రినాగమ్మ సుబ్బారావు కేం తెలుస్తుందమ్మా?" మరేంలేదు లక్ష్మిని మరో యింటికి ఎలా పంపించేది చెప్పూ? నాకా దానిని పెంచే ఓపిక పోయింది. వండుకొని తినడమే యాతనగా ఉంది. నీ పెళ్లినాటికి ఈ ముండ చిన్నపెయ్య. ఇప్పు డెలా ఉందనుకొన్నావు? అప్పుడే అయిదు తరాలయి మనింట్లోనే అవి పెరిగేయి. నా పిల్లలకూ దానికీ ఏమిటి తేడా తల్లీ. నీ అమ్మకేనా బుద్ధి ఉండదూ? తన మానాన తనుపోతే ఈ వెర్రి వీర్రాజు ఎలా ఏడుస్తాడనుకొంది? ముందు నేను పోయి అన్ని ఏర్పాట్లూ చేసుకొని దానిని పిలుచుకోనూ ? అహ అక్కడికి ఆవిడే మహాప్రయోజకురాలు. ఏమిటో అంతా ఆడపెత్తనం అయిపోయింది."

రాధకు తండ్రిమాటలు వింటూంటే కళ్లలో నీళ్లు తిరిగేయి. అమ్మ పోయినతరువాత తను పుట్టింటికి వెళ్లనేలేదు. తన చిన్నతనం అంతా కళ్లకు కట్టినట్టయింది. పెరట్లో ఎన్నో ఆవులూ, దూడలూ ఉండేవి. అన్నయ్యా తనూ వాటితో ఆడుకొనేవారు. ఆఊరూ, ఏరూ అన్నీ ఒక్కమారు మనస్సులోకి తిరిగేయి. నట్టింట్లో దేవుని పూజాపీఠం, ఆ దీపాలు, పూజ, ఆ పారిజాతపుష్పాల వాసన. ఏదీ ఈ పదేళ్లలోనూ ఆ జీవితం అంతా మరిచిపోయింది. "నాన్నా పెరట్లో పారిజాతం చెట్టు పూస్తున్నదా?" అంది. "ఆ యింకా కూర్చుంది. ఈ వెర్రివీరయ్య కోసరంటమ్మా అవన్నీ ఉండేవి? ఆ పారిజాతంచెట్టూ లేదు, ఆ దానిమ్మచెట్టూ లేదు. మీ అమ్మ నన్ను తప్పించి అన్నీ తీసుకొనిపోయింది. ఎవళ్లదారి వాళ్లు చూసుకున్నారు. నేనే అంత చేతకానివాణ్ణనుకొంటున్నారు. నేను చేయవలసిన పని నేనూ చేసి తీరుతాను. ఏమిటో తమాషా అనుకొంటున్నారు."

రాధ ఈ ధోరణి భరించ లేకపోయింది. మరో ప్రసంగం మార్చే ఉద్దేశంతో అంది :

"నాన్నా అన్నయ్యదగ్గరనుంచి ఉత్తరాలు వస్తున్నాయా?"

"ఆ రాస్తున్నాడమ్మా. ఆ మహాపట్నంలో ఇంద్రభోగం అనుభవిస్తున్నాడట. అమ్మా ఎవరి మానాన వాళ్లను ఉండనీ. నేను ఊరు వదలలేను. ఆ తోటకూ, వీటికీ, గాలికీ అంకితం అయిపోయేను.నువ్వు నాకు దగ్గరలోకి వచ్చేశావు. నాకు మరి భయంలేదు. ఇక అవతారం చాలించెయ్యడమే. కన్నకూతురువైనందుకు మీదపడి ఏడిచి నా ముచ్చటతీరుస్తావు. అంతకన్నా నాకేంకావాలమ్మా" అన్నయ్య నీ పెలిగ్రాం చూసుకొని వస్తాడు. ఋణం తీర్చేస్తాడు. నన్ను పున్నామనరకంనుండి తప్పించేస్తాడు. అన్నయ్య సంగతి నీకు తెలియందికాదుకదా. ఎంత డబ్బూ చాలదు. సమయాసమయాలు లేకుండా యీ ముసిలాడు యీ పనిచేసేడేమిటని బాధపడకుండా నా ప్రయాణపుఖర్చులకు ఒక అయిదువందలు జాగ్రత్తచేసే ఉంచేను. ఇక నాకోసం ఎవరూ బాధపడనక్కరలేదు."

ఈ ధోరణి యింకానడిచేదే. రాధ కళ్లలో నీళ్లు చూచి వీర్రాజుగారు సంభాషణ పొడిగించలేదు.

"అమ్మా, రెండు మెతుకులుపెట్టు. స్నానం చేసివస్తాను. ఒక కునుకుతీసి బయలుదేరాలి."

సరీగా గురువారంనాడు అన్ని మంచి చెడ్డలూ చూచుకొని వీర్రాజుగారు ఆవును అంపకం పెట్టడానికి ఆవుకు పెట్టవలసిన సర్వాభరణాలతోనూ, సారె చీరలతోనూ కూతురికి అన్ని అప్పగింతలు పెట్టి తన ఆఖరి బంధం అయిదుతరాల అనుబంధం కూడా వదుల్చుకొని వీర్రాజుగారు స్వగ్రామం చేరుకొన్నారు.

సుబ్బారావు ఆఫీనునుంచిరాగానే పెరట్లో పాలలో లక్ష్మిని చూసి ఏదో చిత్రమైన అనుభూతి పొందేడు. కాని సహజమైన సాంసారిక విసుగు ధోరణిలో అన్నమాట యిది రాధతో : "అయితే ఈ ఆవు బెడద తప్పలేదన్న మాట." రాధ ఏమీ అనలేదు. "నన్ను అప్పగించి నట్టే లక్ష్మినికూడా యితనికి అంటగట్టేరని" అనుకొంది.

సరీగా పౌర్ణమినాడు చంద్రోదయం అవుతూండగా గోమాత ఆడ శిశువును ప్రసవించింది. సరీగా బాబు పుట్టినప్పటి అనుభూతి అంతా జ్ఞాపకంవచ్చి ఏదో అనిర్వచనీయస్థితి పొందింది రాధ.

సుబ్బారావు జున్నుపాలు వాళ్ల ఆఫీసరుగారి యింటికి తీసుకొనివెళ్లి ఆయన అభినందనలు పొందగలిగేడు.

లక్ష్మి యింటికి వచ్చినదగ్గరనుంచీ యింట్లో పాడికి లోటులేకుండాఉంది. సుబ్బారావు చిన్నతనంలో డబ్బాపాలతో పెరిగినా యిప్పుడు పగలు పెరుగూ, రాత్రి పాలూ లేకపోతే గడవడం ఎలాఅన్నట్టు తయారయేడు. పాలలోనున్న ఆహారపు విలువ అతనికి తెలియందికాదు మరి.

రోజుకు నాలుగుశేర్ల పాలుఅంటే ఎంత

పత్రాయని సంగీతరావు

తక్కువ ఖరీదయినా 3 రూపాయలు. తవుడు, చిట్టు, పచ్చిగడ్డి, ఎండుగడ్డి, తెలకపిండి అన్నీ కలిపి మేతకు రోజుకు రూపాయికన్నా ఎక్కువ అవదు. ఏమైనా ఆవు యింట్లో ఉంటే కిట్టుబాటే. వట్టిపోయినతరువాత ఆవు ఖరీదుకు మరికొంతవేస్తే మరో పాడిఆవు తీసుకోవచ్చును. అతనికి ఈ వ్యవహారం సంతృప్తిగానే ఉంది. సుబ్బారావు అనుకొన్నట్టు చివరికంటా జరిగితే అతనికి ఏబాధా లేకపోవును. కాని కథ అడ్డంతిరిగింది నాలుగు మాసాలయేక.

ఒకనాడు ఉన్నట్టుండి ఆవు పెయ్య నిలబడ్డపాటుగా క్రింద పడిపోయింది. మెడ వేలవేసింది. సరీ. ఆవేళ ఆవు తన్నేసింది. రాత్రి పాలు తీయడానికి వెళితే పొడవడానికి వచ్చింది. ఆ పెయ్యవేపే చూస్తూ నాకుతూ కళ్లంట నీరు కారవడం మొదలెట్టింది. రాధ ఆవుల సాలలోకి వెళ్లలేకపోయింది. ఆవును చూడడానికే ఏదో తప్పు చేసినట్టుగా బాధపడింది. బాబునుఒళ్లో పెట్టుకొని దిగులుగా కూర్చుంది.

అంతే. మర్నాటికి పెయ్య మరి దక్కలేదు. రాధకు ఏడుపు వచ్చింది. "నాన్నకు కబురు పెట్టండి" అంది సుబ్బారావుతో. "ఇంకా నయం టెలిగ్రాం యిమ్మన్నావుకాదు" అన్నాడు సుబ్బారావు.

వేళకు ఉదయాన్ని కాఫీలో పాలకు మళ్లీ ప్రయత్నంచేస్తేగాని వీలులేకపోయింది. పగలు పెరుగు లేదు, రాత్రి పాలు లేదు. ఈ అక్కరలేని వెధవ అరివాట్లు అయిపోయేయని విసుక్కున్నాడు సుబ్బారావు.

ఇక నేదోచెయ్యాలి. లేకపోతేఎలా. ఈ పొట్ల గొడ్డును ఎన్నాళ్ళు మేపడం? వాళ్ల ఆఫీసు బంట్రోతు వెంకయ్య చెప్పేడు—"బాబూ చేత పెయ్యచేయించండి. ఇదేం కొత్త సంగతా బాబూ, దూడలు బతకవు ఉవట్నాల్లో. చూడండి. పట్నాల్లో ఏ పశువుకూ పెయ్యలుండవు. పట్నాల పశువులకు తవుడుబుట్ట చూపిస్తే చాలు చేపేస్తాయి. మరీ యిలాంటి సుకుమారపు గొడ్లకు చేతపెయ్య దగ్గరుండాలి" అన్నాడు "అదేదో నువ్వే చూడవోయి" అన్నాడు సుబ్బారావు మర్నాడు ఉదయం చేత పెయ్య చేయించి తెచ్చేడు వెంకయ్య.

చేత పెయ్యని చూడగానే ఒక్కఉరుకు ఉరికి నాకడం మొదలెట్టింది ఆవు. అంతే. పెద్ద చెంబు పట్టుకొని పొదుగుదగ్గరికి చేరేడు వెంకయ్య. పాలతో చెంబు నిండిపోయింది. సుబ్బారావు బ్రహ్మానందభరితుడయేడు. ఈ ఆవులకు యింత అజ్ఞానం ఏమిటా అనుకున్నాడు.

అంతా తన ప్రయోజకత్వమే అన్నట్టు పాలచెంబుతో యింట్లో ప్రవేశించి "ఏమేవ్ రాధా యిలారా" అన్నాడు సుబ్బారావు. నిండా



చాకి రేవుకు పేపర్ కట్టింగ్—కోరా సీతామహాలక్ష్మి (మంగళగిరి)

ఉన్న పాలచెంబుతోఉన్న సుబ్బారావును చూసింది రాధ. మొహంలో నెత్తురు లేకుండా నిలబడిపోయింది. "ఏమంటావు? ఏదో బాధ పడాలా సంసారులం అన్నతరువాత" అన్నాడు సుబ్బారావు. రాధ సహించలేకపోయింది. "వద్దండీ. ఆపాలు యింట్లోకి తేవద్దండీ. ఆపాలు బాబుకు పట్టలేనండీ. అవి పాలు కావండీ బాబూ. అదంతారక్తం. వద్దు బాబూ వద్దు. నన్ను చంపండి కాని యింట్లోకి తేవద్దు అని" అని పిచ్చిగా అరిచి ఏడవడం మొదలెట్టింది.

సుబ్బారావుకు ఈకొత్త ఉప్పెన అర్థం కాలేదు. ఏమిటిది వికారంకాకపోతే, సరిగ్గా వాళ్లనాన్నకుతగ్గ కూతురు అనుకొన్నాడు.

సుబ్బారావు వ్యవహారదక్షత కలవాడు మరి. ఈ అక్కరలేని బెడద ఎలా భరించగలడు. ఆమర్నాడే సంతకు పంపించేశాడు ఆవును.

ఆవు యింట్లోంచి పోయినతరువాత ఏదో అశుభం జరిగిన యిల్లులా అనిపించింది రాధకి. అంతే. ఆ సాలలోకిపోలేదు. గుండె బరువుతో దెబ్బతిన్నట్లుగా అయిపోయింది ఆరోజంతా.

మర్నాడు సాయంత్రం దీపాలు పెట్టేవేళకు పెరట్లో ఏదో చప్పుడయితే ఏమిటాఅని చూడడానికి వెళ్లింది రాధ. లక్ష్మి! ఆ గడ్డిబుట్ట, కుడితి గోలెం అన్నీ వెతుక్కొంటూ కనిపించింది. రాధను చూడగానే ఓదార్పుకోసం అన్నట్టు మెడసాచి నిలబడింది.

రాధ దుఃఖం కట్టలు తెంచుకొంది. "అమ్మా! లక్ష్మి" అంటూ దాని మెడ పట్టుకొని గుండె కరిగేలా విలపించింది. "నాన్న నాకు అప్పగించేడు" యిదేమాట లోపలా బయటా అనుకొంది.

లక్ష్మివీపుమీద రెండు కర్రదెబ్బలు పడడం విని చూసింది రాధ. ఆ పశువుల కుర్రాడు "కట్టు తెంచుకొని వచ్చిందమ్మగారూ" అని తోలుకొనిపోయేడు.

దిగాలుగా లక్ష్మిపోయిన దిక్కుచూస్తూ నిలబడింది రాధ. సుబ్బారావు ఆఫీసునుంచి వస్తూ "ఏమిటలా ఉన్నావు, ఏమిటి నీ బాధ" అన్నాడు. నిజం సుబ్బారావు ముందు తనబాధ కనపర్చడం ఎంతసిగ్గుచేటుపని.

"అబ్బే అదేంలేదండీ. వెర్రిముండ లక్ష్మి కట్టుతేంచుకొని వచ్చేసింది. ఇంకా ఇంట్లో గడ్డీ కుడితీ దొరుకుతాయని దాని ఆశ. నేను దగ్గర నిలబడి దువ్వాలని దాని ఉద్దేశం. మనకూ దానికీ ఋణం తీరిపోయిందని దానికి తెలియదు కదా!"

ఆ రేపు శనివారం సంతకువెళ్లి వెంకయ్య రెండుశేర్లు పాలిచ్చే ఆవును తీసుకొనిరాడూ" అన్నాడు సుబ్బారావు.

రాధ గట్టిగా ప్రాణాలు బిగపట్టి అరిచింది: "ఈ యింట్లోకి మరో ఆవును నేను రానివ్వను. తప్పదు అంటే మీ యిష్టం."

★